# సార్వత్రిక ఎన్నికలకు సమాయత్తం


- అందరి దృష్టి పార్లమెంట్ ఎన్నికలపైనే
- ఇప్పట్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు లేనట్టే..!
- ఫిబ్రవరిలో రానున్న ప్రత్యేకాధికారుల పాలన
- సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మరోసారి ఓటరు జాబితాకు సవరణలు
- 2024 జనవరి 1 నాటికి 18 ఏండ్లు నిండిన వారికి ఓటరుగా నమోదుకు అవకాశం
- దరఖాస్తులు స్వీకరిస్తున్న బూత్ లెవల్ అధికారులు
- ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితా విడుదల
- ఎంపీ ఎన్నికల సన్నద్ధతపై కలెక్టర్లతో ఈసీ వీడియో కాన్ఫరెన్స్



సిద్దిపేట, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఇటీవల రాష్ట్ర శాసనసభ ఎన్నికలు ముగిసి నూతన ప్రభుత్వం ఏర్పాటైన సంగతి తెలిసిందే. ఇక స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు పార్లమెంట్ ఎన్నికలు నూతన సంవత్సరంలో జరిగే అవకాశాలు ఉన్నాయి. ముందుగా స్థానిక సంస్థలు ఎన్నికలు వస్తాయని అన్ని పార్టీల వారు, ఆశావహులు భావించారు. కానీ, ప్రస్తుత పరిస్థితులలో స్థానిక సంస్థలు ఎన్నికలు ఇప్పట్లో జరిగే ఛాన్స్ లేదని పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కొత్త ప్రభుత్వం ఇటీవలే ఏర్పడినందున ఇప్పుడే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించే అవకాశం లేదని చెప్పవచ్చు. జనవరి నెలతో ముగియనున్న సర్పంచ్‌ల స్థానంలో ప్రత్యేకాధికారుల పాలన రానున్నట్టు సమాచారం. ఫిబ్రవరి నుంచి ప్రత్యేకాధికారుల పాలన గ్రామాల్లో కొనసాగనున్నది. ఇక అన్ని రాజకీయ పార్టీలు పార్లమెంట్ ఎన్నికలపై దృష్టిపెట్టాయి. కొత్త సంవత్సరంలో ఫిబ్రవరిలో పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉంది. ఆ దిశగానే ఓటరు జాబితాలో సవరణలు, నూతన ఓటరు నమోదు తదితర ప్రక్రియను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాల అధికార యంత్రంగాలు చేపడుతున్నాయి. జనవరి 1 నాటికి 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయడానికి విస్తృత ఏర్పాటు చేస్తున్నారు. గ్రామ స్థాయిలోని బూత్‌లెవల్ అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. వీటితో పాటు ఓటరు జాబితాలో పేరు తప్పుల సవరణతో పాటు ఇతర ప్రాంతాలకు మార్పు చేసుకునే అవకాశం కల్పించడంతో సంబంధిత ఫారాలను నింపి అధికారులకు అందిస్తున్నారు. ఆన్‌లైన్‌లో సైతం దరఖాస్తు చేసుకునే అవకాశం సైతం ఎన్నికల కమిషన్ కల్పించింది. మొత్తంగా ఫిబ్రవరి రెండో వారంలో తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు. ప్రస్తుతం అన్ని రాజకీయ పార్టీలు పార్లమెంట్ ఎన్నికలపై దృష్టిసారించి కార్యాచరణను సిద్ధం చేస్తున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ స్థానాలు ఉంటాయి. వీటితో పాటు సిద్దిపేట జిల్లా పరిధిలో కరీంనగర్, భువనగిరి పార్లమెంట్ స్థానాలు విస్తరించి ఉన్నాయి. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇటీవల దుబ్బాక ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో ఇటీవల ఎంపీ పదవికి రాజీనామా చేశారు. పార్లమెంట్ ఎన్నికలకు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు సమాయత్తం అవుతున్నాయి. మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఇటీవల సంగారెడ్డి, జహీరాబాద్, నర్సాపూర్‌లో కార్యకర్తల సమావేశాలు నిర్వహించి పార్టీ క్యాడర్‌కు దిశానిర్దేశం చేశారు. త్వరలో జరగనున్న పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. త్వరలోనే మిగతా నియోజకవర్గాల సమావేశాలు నిర్వహించనున్నట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీ సైతం పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమించింది. ఫిబ్రవరిలో ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉండడంతో సార్వత్రిక ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీలు సమాయత్తం అవుతున్నాయి.

### నూతన ఓటరు నమోదు.. ఓటరు జాబితాలో సవరణలు

ఉమ్మడి మెదక్ జిల్లాలోని పది నియోజకవర్గాలతో పాటు సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్ నియోజకవర్గం కలుపుకొని 11 శాసనసభ స్థానాలు ఉన్నాయి. మొన్నటి శాసనసభ నియోజకవర్గ ఎన్నికల్లో సిద్దిపేట నియోజకవర్గంలో 2,33,733 మంది, దుబ్బాక నియోజకవర్గంలో 1,98,100మంది, గజ్వేల్ నియోజకవర్గంలో 2,74,645 మంది, హుస్నాబాద్ నియోజకవర్గంలో 2,42,177 మంది, మెదక్ నియోజకవర్గంలో 2,16,748 మంది,నర్సాపూర్ నియోజకవర్గంలో 2,23,593 మంది,సంగారెడ్డి నియోజకవర్గంలో 2,45,253 మంది, నారాయణ్‌ఖేడ్ నియోజకవర్గంలో 2,31,188 మంది, జహీరాబాద్ నియోజకవర్గంలో 2,70,785 మంది, పటాన్‌చెరు నియోజకవర్గంలో 3,97,237, ఆందోల్ నియోజకవర్గంలో 2,49,248 మంది ఓటర్లు ఉన్నారు.



### మరోసారి ఓటరు నమోదుకు అవకాశం..

ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మరోసారి ఓటరు నమోదు, సవరణలకు ఎన్నికల సంఘం అవకాశం ఇవ్వడంతో ఈ సంఖ్య మరింతగా పెరగనున్నది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లోని పోలింగ్ బూత్ కేంద్రాల్లో అంగన్‌వాడీ టీచర్లు ఓటు హక్కు నమోదు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునే విధంగా గ్రామాల్లో వివిధ ప్రచార మాధ్యమాల ద్వార విస్తృత ప్రచారం చేస్తున్నారు. 18 ఏండ్లు నిండిన ప్రతి పౌరుడు తమ ఓటు నమోదు చేసుకోవాల్సిన బాధ్యత వారిపై ఉందని గుర్తుచేస్తున్నారు. ప్రస్తుతం ఓటు నమోదు చేసుకుంటే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తమ ఓటు ద్వారా దేశ ప్రధానిని ఎన్నుకునే అవకాశం దక్కుతుంది. అందువల్ల అర్హులైన ప్రతి ఒక్కరూ విధిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని క్షేత్రస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికార యంత్రాంగం కోరుతున్నది. ఓటరు జాబితాలో సైతం తప్పొప్పులను సైతం సవరణ చేసుకోవడంతో పాటు ఒక ప్రాంతం నుంచి ఇంకో ప్రాంతానికి మార్పు చేసుకోవడానికి సైతం అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. సంబంధిత ఫారాన్ని నింపి గ్రామ స్థాయిలోని పోలింగ్ బూత్ అధికారులకు అందజేయాల్సి ఉంటుంది. వాటిని జిల్లా ఎన్నికల అధికారి పంపుతారు. నూతన ఓటరుగా నమోదు చేసుకోవడానికి, సవరణలు చేసుకోవడానికి సంబంధిత ఫారాలు గ్రామ స్థాయిలో ఉండే పోలింగ్ బూత్ అధికారుల వద్ద లభిస్తాయి. లేదా ఆన్‌లైన్ ద్వారా సైతం దరఖాస్తు చేసుకోవచ్చు. బుధవారం నుంచి ఓటరు జాబితా సవరణ ప్రక్రియను చేపట్టారు. నూతన సంవత్సరం 2024 జనవరి 5వ తేదీ వరకు కొత్తగా వచ్చిన దరఖాస్తుల మార్పులు, చేర్పులు చేపట్టి తుది ఓటరు జాబితా ముసాయిదాను జనవరి 6న విడుదల చేస్తారు. ఈ జాబితాపై అభ్యంతరాలను 22వ తేదీ వరకు స్వీకరిస్తారు. వచ్చిన దరఖాస్తులను బూత్ లెవల్ అధికారుల బృందం పరిశీలన చేపడుతుంది. ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితాను విడుదల చేసేలా కార్యాచరణ రూపొందించి పనిచేస్తున్నారు.

# నిఘా నేత్రాలతో నేరాలకు అడ్డుకట్ట



**తిప్పనగుల్ల గ్రామంలో 8 సీసీ కెమెరాల ఏర్పాటు**

- దాత సహకారంతో ఏర్పాటు
- తగ్గుముఖం పడుతున్న నేరాలు



మెదక్ జిల్లా తిప్పనగుల్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

నిజాంపేట, డిసెంబర్ 21 : నేర ప్రవృతి గల వారిని పట్టుకోవడంలో సీసీ కెమెరాలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదం చేస్తాయి. పట్టణాలకే పరిమితమైన సీసీ కెమెరాలు నేడు గ్రామాల్లోనూ ఏర్పాటు చేస్తున్నారు. నేరాలను అదుపులోకి తీసుకువచ్చేందుకు పోలీస్ సిబ్బంది వీటి ఏర్పాటుపై దృష్టిసారిస్తున్నారు. ప్రజలు, వ్యాపారులు, ప్రజాప్రతినిధులకు సీసీ కెమెరాలతో కలిగే ప్రయోజనాల గురించి వివరించి ప్రధాన వీధులు, రద్దీ ప్రాంతాలు, షాప్‌లు, ఆలయాలు, ముఖ్య కూడళ్లలో ఏర్పాటుకు ప్రోత్సహిస్తున్నారు. సీసీ కెమెరాల ద్వారా క్షణాల్లో నేరం జరిగిన ప్రదేశం, అందుకు పాల్పడిన వ్యక్తిని గుర్తించడానికి వీలవుతుంది. మెదక్ జిల్లా నిజాంపేట మండలంలోని తిప్పనగుల్లలో సర్పంచ్ చంద్రవర్ధిని,పాలకవర్గం సమక్షంలో ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సమావేశం ఏర్పాటు చేసి సూచించారు. బచ్చురాజ్‌పల్లి గ్రామానికి చెందిన దాత గోపాల్‌రెడ్డి తిప్పనగుల్ల గ్రామంలో 8 సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళంగా రూ.1.50 లక్షలను అందజేశారు.వాటితో గ్రామ నలుమూలలల, ప్రధాన కూడళ్ల వద్ద, ఇతర గ్రామాల నుంచి తిప్పనగుల్లకు వచ్చే ప్రతి మార్గంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటిని గ్రామ పంచాయతీలోని మానిటర్‌కు అనుసంధానం చేశారు. గ్రామంలో జరిగే దొంగతనాలు,గ్రామానికి ఎవరు వస్తున్నారు, ఎవరు వెళ్తున్నారో అన్న విషయం సీసీ కెమెరాల ఏర్పాటుతో క్షణాల్లో స్పష్టంగా తెలుస్తున్నది.



మెదక్ జిల్లా తిప్పనగుల్ల గ్రామంలోకి వచ్చే ప్రధాన మార్గంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

### నేరాల నియంత్రణలో కీలక పాత్ర



శాంతి భద్రత పరిరక్షణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం. దొంగతనాలు,కిడ్నాప్ వంటి కేసుల్లో సీసీ పుటేజీలు సాక్ష్యాలుగా ఉపయోగపడుతున్నాయి. ముఖ్యంగా చైన్ స్నాచింగ్, ట్రిపుల్ రైడ్, ఓవర్‌లోడ్, అతివేగంతో వాహనం నడపడం వంటివి సీసీ కెమెరాల్లో రికార్డ్ కాగా, వాటిని సాక్ష్యాలుగా పరిగణించి వారిపై తగిన చర్యలు తీసుకుంటున్నాం.

**-శ్రీనివాస్‌రెడ్డి, నిజాంపేట ఎస్సై**

### దాత సహకారం మరువలేనిది



తిప్పనగుల్ల గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటుకు ఆర్థిక సహకారం అందించాలని బచ్చురాజ్‌పల్లికి చెందిన దాత గోపాల్‌రెడ్డిని అడుగగానే గ్రామంలో 8 సీసీ కెమెరాలకు ఏర్పాటుకు రూ.1.50 లక్షలను విరాళంగా అందించారు. వాటితోనే గ్రామంలో హై క్వాలిటీ గల సీసీ కెమెరాలను ప్రధాన వీధులు, రద్దీ ప్రదేశాల్లో ఏర్పాటు చేశాం. ఇప్పుడు మా గ్రామంలోకి ఎటువైపు ఎవరు వచ్చినా, వెళ్లినా ప్రతి వారు సీసీ కెమెరాల్లో రికార్డు అవుతున్నాయి. దాత గోపాల్‌రెడ్డి సహకారం మరువలేనిది.

**-చంద్రవర్ధిని, సర్పంచ్ తిప్పనగుల్ల**




# కొనలేం.. తినలేం

- కొండెక్కిన కోడిగుడ్డు ధర
- మండుతున్న వంట నూనెలు
- భగ్గుమంటున్న సన్నబియ్యం
- కూరగాయలు కొనలేక పోతున్న సామాన్యులు
- అమాంతం తగ్గిపోయిన ఉల్లి
- మార్కెట్ వెళ్లాలంటే జంకుతున్న ప్రజలు
- ధరలు కట్టడి చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

రామాయంపేట, డిసెంబర్ 21 : కోడిగుడ్డును కొనలేకపోతున్నారు. బియ్యం, వంటనూనెలు ధరలు అమాంతం పెరిగిపోయాయి. పచ్చిమిర్చి భగ్గుమంటున్నది. రోజురోజుకూ ఆకాశాన్నంటున్న ధరలతో సామాన్యుడు బెంబేలెత్తిపోతున్నాడు. వంటింట్లోకి నిత్యావసరాలు కొనాలంటే మహిళలు ఆలోచిస్తున్నారు. ముఖ్యంగా మునుపెన్నడూ లేనంతలా గుడ్ల ధరలు కొండెక్కాయి. అధిక పోషకాలు ఉండడంతో ప్రతి ఒక్కరూ గుడ్డుతో ప్రత్యేక వంటకాలు చేసుకుని మరీ తింటారు. కానీ ప్రస్తుతం గుడ్డు ధర రూ.4 నుంచి రూ.6కు పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొన్నది.

### బియ్యం ధరలకు రెక్కలు

త్వరలో పెండిండ్ల సీజన్ రానుండడంతో దొడ్డుబియ్యంతోపాటు సన్న బియ్యం ధరలు కూడా అమాంతం పెరిగిపోయాయి. గత ఏడాది ఇదే సమయంలో క్వింటాల్ సన్నబియ్యం ధర రూ.4వేలుండగా, ప్రస్తుతం రూ. 5వేలు పలుకుతున్నది. ధరలు ఒక్కసారిగా విపరీతంగా పెరగడంతో పేద, మధ్యతరగతి ప్రజలు మళ్లీ దొడ్డు బియ్యానికే మొగ్గు చూపుతున్నారు. భవిష్యత్తులో ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు వ్యాపారవర్గాలు పేర్కొంటున్నారు.



### పదిరోజుల నుంచి పడి పోయిన ఉల్లి

ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదంటారు. సామాన్యంగా ప్రతిరోజు ప్రతి కూరలో ఉల్లి వినియోగం ఉంటుంది. లేదంటే ఆ కూర రుచిగా ఉండదు. ఇది జగమెరిగిన సత్యం.నెల రోజుల క్రితం కిలో రూ.100 చేరి కంటతడిపెట్టించిన ఉల్లిగడ్డ ప్రస్తుతం రూ.25.రూ.30కి చేరింది. ధర అమాంతం తగ్గిపోవడంతో ప్రజలకు ఊరటలభించింది. తోపుడుబండ్లు, ఆటోలపై వ్యాపారస్తులు కిలో రూ. 10 చొప్పున విక్రయిస్తున్నారు.

### వంటనూనెలు కొనలేం..



వంటనూనెల ధరలు వారం రోజుల్లో కిలో నూనె రూ. 20కి పెరిగింది. గతంలో రూ.100 ఉండగా, నేడు రూ.120 నుంచి రూ.125 వరకు వ్యాపారులు విక్రయిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నూనెగింజల రైతులను ఆదుకోవడం కోసం భారీగా ట్యాక్స్‌ని పెంచడంతో రిటైల్ మార్కెట్‌లో ఒక్కసారిగా ధరలు భగ్గుమంటున్నాయి. దిగుమతి సుంకాన్ని పెంచిన కారణాన్ని చూపిస్తూ వ్యాపారులు కిలోకు రూ.10 పెంచేశారు. దీంతో వంటింట్లో వంటల ఘుమఘుమలు ఆవిరైపోతున్నాయి.

### మార్కెట్‌కు వెళ్లడం లేదు



కూరగాయలను కొనేందుకు గతంలో వారం వారం మార్కెట్‌కు వెళ్లేవాళ్లం. కానీ ప్రస్తుతం ధరలు ఆకాశాన్నంటుతుండడంతో మార్కెట్‌కు వెళ్లలేక పోతున్నాం. అక్కడ ఏది కొందామన్నా విపరీతమైన ధరలు ఉన్నాయి. అం దుకే పోవడం మానేశాం. గతంలో రూ. వంద తీసుకెళ్తే సంచి నిండేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. 3,4 రకాల కూరగాయలు తీసుకుందామన్నా రూ.250 అవుతున్నది.

**-బెస్త బాలవ్వ, రామాయంపేట**

### ప్రభుత్వం పట్టించుకోవాలి




ధరల పెరుగుదలపై ప్రభుత్వం పట్టించుకుంటేనే బాగుంటుంది. లేదంటే సామాన్యులు కూరగాయలు తినలేం. మార్కెట్‌లో ఏది కొందామన్నా వంటనూనెలు, ఉల్లిగడ్డలు, పచ్చిమిర్చి చివరకు బియ్యం ధరలను కూడా వ్యాపారులు పెంచేసారు. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలపై ఆర్థికంగా భారం పడుతుంది. ఈ పరిస్థితిని నివారించేందుకు అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలి.

**-లక్ష్మి, గిరిజనతండా రామాయంపేట**



బుధవారం సందడిగా రామాయంపేటలో జరిగిన మార్కెట్





న్యాల్‌కల్ : చలి తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు మంటలు కాచుకుంటున్న గ్రామస్తులు

# వణికిస్తున్న చలి

- గజగజలాడుతున్న పల్లెలు
- పడిపోతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు
- బయటకు వెళ్లేందుకు జంకుతున్న ప్రజలు
- చలిమంట వద్ద జాగ్రత్తగా ఉండాలంటున్న నిపుణులు

న్యాల్‌కల్, డిసెంబర్ 21: వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో ఒక్కసారిగా పెరిగిన చలి తీవ్రతతో ప్రజలు గజగజ వణికిపోతున్నారు. ఎముకల కొరికే చలితో ఉదయమే వివిధ పనుల నిమిత్తం వెళ్లే కూలీలు, కార్మికులు, రైతులు, ఉద్యోగులు జంకుతున్నారు. చలి తీవ్రతతో కొందరైతే తెల్లవారినా దుప్పట్లను విడవక, మంట, ఎండను ఆశ్రయిస్తున్నారు. పగటి ఉష్ణోగ్రతలు సైతం పడిపోతుండడంతో సాయంత్రం 6 గంటలకే ప్రజలు ఇండ్లలోకి జారుకుంటున్నారు. చలి తీవ్రత నుంచి రక్షించుకునేందుకు ప్రజలు స్వెటర్లు, జర్కిన్, మప్లరు, మంకీ క్యాప్‌లు, ఉన్ని దుస్తులు, చేతులకు గ్లౌస్‌లు, కాళ్లకు సాక్స్‌లను వినియోగించుకుంటున్నారు. గతేడాది కంటే అధికంగా ధరలు పెరిగినప్పటికీ చలి తీవ్రత నుంచి కాపాడుకునేందుకు తప్పని పరిస్థితుల్లో వాటిని కొనుగోలు చేయాల్సి వస్తుందని ప్రజలు అంటున్నారు. వాహనాలపై దూర ప్రాంతాలకు వెళ్లేందుకు వాహనచోదకులు సాహసించడం లేదు. అత్యవసరం ఉంటేనే హెల్మెట్, జర్కిన్, గ్లౌస్‌లను వేసుకొని వెళ్తున్నారు. గతేడాది కంటే ఈ సారి చలి ప్రభావం ఎక్కువగా ఉండడంతో ఇంటి అవరణలో చలిమంటలు ఏర్పాటు చేసుకొని చలి తీవ్రతను తట్టుకునేందుకు నానాతంటాలు పడుతున్నారు. చలి మంటల వద్ద కూర్చునేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకుంటే మంచిదని నిపుణులు అభిప్రాయపడున్నారు. చలి మంటల వద్ద ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం జరిగే అవకాశం ఉందంటున్నారు. పొగకు కండ్లు తిరిగి పడిపోయే ప్రమాదముందని, ఒక్కోసారి లోబీపీ వచ్చే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా దుప్పట్లు కప్పుకొని మంటల వద్ద కూర్చుంటే అవి అంటుకొని ప్రమాదం జరిగే అవకాశాలుంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరికొందరు మంచాల కింద నిప్పులు పెట్టుకుని పడుకోవడం మంచిది కాదంటున్నారు. ఏది ఏమైనప్పటికీ చలికాలం ముగిసే వరకు తగు జాగ్రత్తలు తీసుకుంటే మంచిదంటున్నారు.





చలి నుంచి రక్షించుకునేందుకు మప్లర్లు, స్వెటర్లలను ధరించిన పెద్దలు, చిన్నారి